

# నడుస్తున్న చరిత్ర

## - విహారి

తెల్లవారటానికి ఇంకా సమయం వుంది.

కంటి మీద కునుకు లేదు.

అమ్మా నేనూ - ఒకరి కొకరం ఎదురెదురుగా.... మండుతున్న కళ్ళతో, ఆవేదన నిండిన మనసుతో ....

రాత్రి పదింటికి గుంటూరు నుంచీ పెద్ద మామయ్య ఫోను చేశాడు. ‘‘నాన్న గారి పరిస్థితేం బాలేదే రాజేశ్వరీ. ఎన్నారై హాస్పటల్‌లో వున్నాం. అందరికీ ఫోన్లు చేస్తున్నాను’’

యాభై రెండేళ్ళ అమ్మ పసి పిల్లలా విలవిల్లాడింది. వెక్కులు పెట్ట సాగింది. ఎనభై అయిదేళ్ళ వాళ్ళమ్మ, మా అమ్మమ్మ - శాంతంగా వుంది. ఆమెని తలచుకుని మరీ బాధపడింది. తన తల్లికి కలుగుతున్న దుఃఖానికి నా తల్లి కుమిలిపోతోంది! కళ్ళూ ముక్కూ వాచిపోయిన్నై.

ఎన్నెన్నో జ్ఞాపకాలు. మనసు ఒకసారి జ్ఞాపకాల గమనం మొదలెడితే లోక ప్రమాణాల కతీతంగా పరుగులు పెట్టటం చూస్తున్నాను. ఎన్నెన్ని ఎత్తుల్నో ఎక్కుతోంది. ఎన్నెన్ని పల్లాల్లోకో పడిపోతోంది. పల్టీలు కొడుతోంది.

తొంభై రెండేళ్ళ నారాయణ తాతయ్యంటే -ఆనాటి వాళ్ళ ఉమ్మడి కుటుంబానికి ప్రభువు. ఆరుగురు కొడుకులూ, నలుగురు కూతుళ్ళ సంసారానికి సారథి. ఆ వ్యవస్థకీ, సంస్థకీ అధికారి. పెద్ద తలకాయ. సంప్రదాయాలకీ, ఆచార వ్యవహారాలకీ మార్గదర్శి.

శాంతమ్మ అమ్మమ్మ నుంచీ డెబ్భైయేళ్ళ పెద్ద మామయ్య స్వామి, మా అమ్మ వరకూ - అందరికీ ఆయనంటే భయమూ, భక్తీ, గౌరవమూ. ఆయన ప్రేమా, ఆప్యాయతా, కడగొట్టు పిల్లగా తనపట్ల ముద్దు గారాబం, మందలింపులూ, హెచ్చరికలూ-అన్నీ గుర్తు చేసుకుంది అమ్మ.

తాతయ్యకి మనవలూ మనవరాళ్ళే ఇరవైముగ్గురు. మునిమనవలు నలుగురట. ‘‘ఈ ఇరవై ఏడు మందీ నక్షత్ర మండలంరా. మన రైజింగ్ స్టార్స్’’ అనేవారట.

సంతానమంతా ఆయన చెప్పుచేతల కిందే పెరిగినా ఒక్కొక్కరూ ఒక్కొక్క జీవన శైలిని అలవరుచుకుని-క్రమేపీ ఎవరిదారి వారు చూసుకున్నారు. పెళ్ళిళ్ళూ శుభ కార్యాలూ బాధ్యతలన్నీ ఈయనే నిర్వహించారు.

ఇవాళ స్వామి మామయ్య కాక ముగ్గురు కొడుకులూ, కోడళ్ళూ హైదరాబాద్‌లో ఉద్యోగస్థులు. ఐదో ఆయన అమెరికాలో. అమ్మ కాక ముగ్గురు కూతుళ్ళల్లో ఇద్దరు మళ్ళీ హైదరాబాద్‌లోనే. అల్లుళ్ళు చిన్నా చితకా ఉద్యోగాల్లో వున్నారు. ఇంకో కూతురు కాంతమ్మ బాపట్ల నివాసం. వాళ్ళాయన అడ్వకేట్.

తాతయ్యా, అమ్మమ్మా-స్వామి మామయ్య దగ్గర గుంటూర్లో స్థిరపడ్డారు. స్వగృహం. పుట్టిపెరిగిన ఊరు. ఆనాటి శిరస్తదారుగా తాతయ్య రిటైరయిందీ అక్కడే. స్వామి మామయ్య టీచర్ చేసి రిటైరయిందీ అక్కడే. ఆయనకి నలుగురూ ఆడపిల్లలు. చివర కూతురికి ఇంకా పెళ్ళి కావాలి. బీటెక్ చదివి చెన్నైలో సాఫ్ట్ వేర్‌లో పని చేస్తోంది.

హాలు నిశ్శబ్దంగా వుంది. నేను నా ఆలోచనల్లో ఢిల్లీ గుంటూరు మధ్య దూరాన్ని కొలుస్తూ కూచున్నాను.

ఇప్పటిదాకా ఈ వివరాలన్నీ అమ్మనాకు చెప్పుకుంది. కొన్ని నాకు తెలిసినవీ, కొన్ని తెలియ నివీ. నిజానికి ఒకటి రెండు రహస్య కవాటాల్నీ తెరచినట్లు, పైకి చెప్పుకుంది.

''తాతయ్యకి అమ్మమ్మ గురించి చాలా దిగు లురా, ఈ వయస్సులో కూడా తన పక్కన మంచం మీద పడుకోవాల్సిందే. ఇద్దరికీ ఒకటే నీళ్ళ చెంబూ, గ్లాసూ. ఒక అరటి పండునే సగం సగం తిని ఆనందిస్తారు. అదేదో పాటలో అన్నట్టు అన్నిటా ఫిఫ్టీ ఫిఫ్టీ. తాను ఈయనకంటే ముందు రాలిపోవాలని ఆమెకూ, ఆమె ఉండగానే తాను పోవాలనే వాంఛ ఈయనకూ. ఈ వయస్సులో ఆమె యీ దుఃఖాన్నెలా భరిస్తోందో'' అని బాధ పడింది. నాలోనూ అలజడి.



# అగణితం

ఈ కొండ
నా ఊహల ఎత్తును పెంచింది
దీన్ని మీటర్లతో కొలవకండి
ఈ విశాల హరిత మైదానాల్లో
నా కవిత్వ హరిణం విహరిస్తుంది
దీనిపై వ్యాపారం నీడలు పరచకండి
తొలి ఊపిరి పీల్చినప్పటి నుంచీ
ఈ ఊరు నా నరాల్లో ప్రవహిస్తున్నది
ఈ వీధులూ
దారి పొడుగునా పారేసుకున్న పారవశ్యాలూ
సగం తెరిచిన తలుపుల వెనుక
కదిలే భావానా ప్రపంచాలూ
నా స్వభావాన్ని సంవేదనగా మార్చాయి
ఈ అనర్ఘ జ్ఞాపకాల ఖజానాని
కేవలం
ఒక భౌగోళిక చిరునామాగా చూడకండి
ఇది కన్నీళ్లతో
మొలిచిన నేల
దీన్ని వర్ష పాతంగా లెక్కించకండి
ఆది మగతికీ
స్వాభావిక స్థితికీ మధ్య
సంతులనం ముఖ్యం
చలనం మంచిదే
జ్వలనం కాదు

–డా. ఎన్.గోపి
**9391028496**

టైమ్ చూశాను. నాలుగైంది. లేచి వెంట వెంటనే ఫోన్‌లు మొదలు పెట్టాను. మా బాస్‌కీ, ఎయిర్‌వేస్‌కీ . . . ఇలా..

''నువ్ త్వరగా తయారవు. మనం బయల్దే రదాం'' అని అమ్మని హెచ్చరించి నేనూ బాత్‌రూ మ్‌కి నడిచాను.

తేలిక పడని మనసుతోనే భారంగా కదిలింది అమ్మ.

హైదరాబాద్‌కి విమాన ప్రయాణం.

ఫ్లైట్‌లో ఎవరి ఆలోచనలు వారివిగా ఉన్నై.

నాలుగేళ్ళ క్రితం దుర్ఘటన కళ్ళముందు కది లింది నాకు. ముంబైకి ఆఫీసు పనిమీద వెళ్ళిన నాన్న–హోటల్ రూమ్‌లోనే 'హార్ట్ ఎటాక్'తో చనిపోయారు. ఆ దుఃఖాన్ని అమ్మా నేనూ కలిసి అనుభవించాం. నేనింకా బీటెక్ మూడో సంవత్సరం చదువులో ఉన్నాను. సొంత అపా ర్ట్‌మెంట్. నాన్న పెన్షన్. ఆయన డెత్ బెని ఫిట్స్. ఆర్థికంగా ఏ ఇబ్బందీ లేదు. ఆ షాక్ నుంచీ కోలుకోవడానికి మాత్రం ఏడాదిపైనే పట్టింది అమ్మకి. నా బీటెక్ అయింది. క్యాంపస్ సెలక్షన్‌లో ఢిల్లీలోనే వుద్యోగం. రోజులు గడిచిపోతున్నై.

ఇప్పుడు–అమ్మకి ఇదో అశనిఘాతం.

పదిగంటలయ్యేసరికి హైదరాబాద్‌లో విమానం దిగాం. అక్కణ్ణుంచీ విజయవాడకి టాక్సీ ప్రయాణం. సాయంత్రం ఆరైంది. సరా సరి ఎన్నార్ఐ హాస్పటల్‌కి వెళ్ళాం.

బెడ్‌మీద తాతయ్య. స్పృహలేదు. మని షికి కిందా పైనా ఏవేవో గొట్టాలూ, కట్లూ మరకలూ, సెలైన్ వెళ్తోంది. బెడ్ పక్కన మావయ్య ఒక్కడే ఉన్నాడు.

అమ్మకి దుఃఖం ఆగలేదు. గ్రుడ్లనీరు కొంగుతో ఆపుకుని స్టూలు మీద కూచుంది.

జరిగిన ఘటనలూ, జరుగుతున్న వైద్యం వివరాలు చెప్పుకొచ్చాడు స్వామి మావయ్య.

''పెన్షన్ తెచ్చుకోవటానికి బ్యాంక్‌కి వెళ్ళొ చ్చాడు. ఆటో దిగుతూ వీధిగుమ్మం దగ్గరే పడిపోయాడు. స్ట్రోక్. నోరూ, కుడికాలూ, చెయ్యీ పడిపోయాయి. స్పృహలేదు. అదే ఆటోలో గుంటూరులో హాస్పిటల్స్ చాలా తిరిగాం. తెలిసిన డాక్టర్లు చేర్చుకోమన్నారు. ఏజ్ భయమట. చివరికి–ఈ హాస్పటల్ కొచ్చాం. అతికష్టం మీద అడ్మిట్ చేసుకు న్నారు. చేతనైన వైద్యం చేస్తున్నారు''

చాలాసేపు మౌనంగా వుండి, ఆ తర్వాత అడిగింది అమ్మ, ''ఇదేంటన్నయ్యా మనవాళ్ళొ వరూ రాలేదు?'' అని.

ఏకుల బుట్టలో తొక్కిపెట్టిన ప్రశ్న.

''నీకు చెప్పినట్టే మన వాళ్ళందరికీ చెప్పాను రాత్రే'' అని ఊరుకున్నాడు మావయ్య.

''కాంతం అక్క వచ్చి ఇంట్లో వుందాయేం?'' అంది అమ్మ.

''లేదే. అదీ రాలేదు రాజేశ్వరీ'' అని బుజం మీద కండువాతో మొహాన్న చెమట తుడుచుకు న్నాడు. ''ఏం చెప్పుకుంటాంగానీ, చివరికి నిన్న రాత్రి నుంచీ నాకు రిలీవరే దొరకలేదు.''

ఇవీ బాంధవ్యాలూ, అనుబంధాలూ అన్న ట్టున్నాయి మావయ్య కళ్ళు. దీర్ఘంగా నిట్టూ రుస్తూ బెడ్ చివరగా కూచున్నాడు.

క్షణాల్లో తర్వాత మళ్ళీ ఆయనే అన్నాడు, ''దానికి నాన్నంటే కోపమే. దగ్గర్లోనే వున్నా తనకూ పిల్లలకూ ఏ సహాయమూ చెయ్యలేదం టుంది. ''మా ఆడపిల్లలిద్దరికీ ఏమన్నా బంగారం నగ చేయించొచ్చుగదే'' అని అమ్మనీ సతాయిం చింది. ఈమేమో ''నాన్నతో వో మాటనరాదుటే'' అంటుంది. 'ఆయన సంగతి సరేసరి' అని మూతి విరిచి వదిలేసింది.... ఇట్లాంటివే ... పొరపొ చ్చాలు ....''

నేను కొంచెం ఆశ్చర్యంగానే ఆయనవైపు చూస్తూ కూర్చున్నాను. నా చూపుల్లోని ప్రశ్నకి అమ్మే సమాధానం చెప్పింది.

''మా నాన్న అలాంటి వ్యవహారాలన్నీ ఎప్పుడో సెటిల్ చేసేశారంటారు. అలాంటివన్నీ మనకసలు పట్టవుగదా''

అమ్మ జవాబులోంచే కొత్త ప్రశ్నలు చాలా మొలకెత్తాయి నా బుర్రలో. కానీ ఏమీ అడగలేదు.

ఈ మాటల్ని మారుస్తూ మావయ్య వైపు చూస్తూ చెప్పింది అమ్మ, ''రమేశ్‌ని తీసుకుని నువ్వింటికి వెళ్ళన్నయ్యా. వాడు స్నానం చేసి, ఇంత తిని వస్తాడు. రాత్రికి నేనూ వాడూ వుంటా మిక్కడ. నాకు ఏ టిఫినో పంపమను వదిన్ని. అమ్మకు ధైర్యం చెప్పు. రాత్రికో కునుకు తియ్ నువ్వు. రేపు ఉదయం ఇంటికి వస్తాను నేను''

ఈ ప్రతిపాదన మీద తర్జన భర్జనలేం జరగ లేదు. మావయ్యకి తండ్రిని వదిలి వెళ్ళటం ఇష్టం లేకపోయినా, అవసరం కనుక తలూపేడు.

నేనూ మావయ్యా గుంటూరుకి బయ ల్దేరాం. రాత్రి పదవుతుండగా నేను అమ్మకి టిఫిన్ తీసుకుని హాస్పటల్‌కి వచ్చాను.

ఆ రాత్రంతా, అమ్మానేనూ–వంతుల వారీగా మేలుక్కూచున్నాం. తాతయ్య పరిస్థితేం మెరుగు కాలేదు కోమాలోనే వున్నాడు. ఎక్కిళ్ళు. రెండు మూడుసార్లు డ్యూటీ డాక్టర్‌ని పిలిచి చూపించాం. ఏదో ఇంజెక్షనిచ్చారు.

తెల్లవారుతూనే వచ్చేశాడు స్వామి మామయ్య. నేనూ అమ్మా ఇంటికి వెళ్ళాం.

ఆ సాయంత్రానికే తాతయ్యని హాస్పటల్ నుంచీ డిశ్చార్జ్ చేశారట. ఇంటికి తీసుకొచ్చాడు మావయ్య. ఆ తర్వాత–నిండా గంట గడిచే లోగానే తాతయ్య ప్రాణం విడిచాడు.

"ఆయన ప్రాణం స్వగృహంలో పోవాలనుంది."

"అదృష్టవంతుడు. నారాయణగారు పండుటాకులా రాలిపోయాడు"

మావయ్య పక్కన కూర్చుని మాట్లాడుతున్నారు పరిచయస్థులు.

ఇరుగు పొరుగు ఆడవాళ్ళూ, అమ్మా, అత్తయ్యా, అమ్మమ్మ పక్కన కూర్చుని 'ఈ వయస్సులో ఈమెకీ ఖర్మ యేమిటి?' అని బాధ వ్యక్తం చేస్తున్నారు.

బయట షామియానా వేయించారు. నలుగురూ చేరారు. తాతయ్య వ్యక్తిత్వం గురించీ, ఆయన కుటుంబం కోసం పడిన శ్రమ గురించీ మాటలు సాగాయి.

"మనవాళ్ళందరికీ కాస్త ఫోన్ చెయ్యి రమేశ్" అని ఓ లిస్ట్ నా చేతిలో పెట్టాడు మావయ్య.

నా సెల్‌కి పని పెట్టాన్నేను.

"అయితే పోయాడన్నమాట!" అన్నాడు రెండో మావయ్య.

"సరే కానీయండి. నేను రాలేనని చెప్పు" మూడో మావయ్య.

"వెరీ సారీరా అన్నయ్యకు చెప్పు. నేనిప్పుడు అహమ్మదాబాద్‌లో వున్నా. ఆఫీస్ పనిమీద వచ్చాను" అని పెట్టేశాడు నాలుగో మావయ్య.

"చూస్తాను. అవకాశముంటే చేరుకుంటాను. నా కోసం కార్యక్రమాన్ని ఆపకండి" ఐదో ఆయన. విని 'సరే' అన్నాడు అమెరికా ఆయన. "అనుకున్నదేగా నాయనా. కానీయండి." పెద్దత్త.

"మా పరిస్థితులు మీ మామయ్యకు తెలుసు లేరా రమేశ్. వెంటనే కదల్లేము" అన్నది రెండో అత్త.

"రాత్రి చెప్పాడులేమ్మా అన్నయ్య. ఇవ్వాళో రేపో అనే అనుకున్నాన్లే" అని సెల్ స్విచ్ ఆఫ్ చేసింది కాంతమ్మత్త.

ఇదే వరసలో-వాళ్ళందరి ప్రతిస్పందనల్నీ స్వామి మావయ్యకు చెప్పాను.

మా మాటల్ని అక్కడ చేరిన వారు కొందరు విన్నారు. పక్కింటి పాత కరణంగారు అన్నారు. "బంధుత్వాలన్నీ ఇలా తెగిపోతున్నయ్. పదిమంది సంతానంలో చివరికి ఇద్దరు తేలారు. ఇదీ పరిస్థితి!"

"ఏమో ఎవరి అవస్థలేమిటో?"

"ఆఁ. ఏం అవస్థలండీ. తండ్రి మరణం కంటే పెద్ద అవస్థేవిటండీ. అడిగేవాడు లేకపోతే సరి"

"అసలు సమస్య వేరే వుంది లెండి. నారాయణగారు తనకున్న నాలుగు రూకలూ ఈ స్వామి చేతిలో పెట్టి ఆ పెద్దామెతో వీళ్ళ దగ్గర ఉంటానన్నాడే మొదలైంది ప్రాబ్లెమ్. నారాయణగారికీ, శాంతమ్మగారికీ వీళ్ళంటే వో వీసం ఎక్కువ శ్రద్ధ. పాపం స్వామి నలుగురు ఆడపిల్లల తండ్రికదా! పెన్షన్ కొడుక్కి కాస్త వెసులుబాటునిస్తుందని నారాయణగారి మనసులో ఆలోచన"

పరిచయస్థుల్లో అభిప్రాయ ప్రకటనం జరుగుతోంది.

తాతయ్య శవానికి దగ్గరగా కూర్చుని ఏడుస్తున్న అమ్మమ్మకీ, ఆడవాళ్ళకీ కూడా ఈ మాటలు వినిపిస్తూనే వున్నై.

నేనూ వింటూ కూచున్నాను.

వాతావరణం ఇరుకిరుగ్గా వున్నట్టనిపిస్తోంది.

రాత్రి గడుస్తోంది.

తాతయ్య భౌతిక కాయాన్ని ఐస్‌బాక్స్‌లో వుంచాం.

బంధువులెవ్వరూ రాలేదు.

తెల్లవారింది.

ఎండ కరకరలాడుతోంది. ఒకటే ఉక్కపోత. ఊళ్ళో తెలిసిన వాళ్ళు వచ్చి చూసిపోతున్నారు.

వేడిగాలి రివ్వున కొడుతోంది. పన్నెండయింది.

నారాయణ తాతయ్య ఇతర సంతానం జాడ లేదు.

పెద్ద మనుషులెవరో శవయాత్రకి తొందరపెడుతున్నారు. పురోహితుడు ఏర్పాట్లల్లో వున్నాడు.

ఒంటిగంటకి శవం లేచింది.

ఏడుపులూ. . . ఊరడింపులూ . . . రోదనలూ . . .

గాలిస్తంభించింది. శవయాత్ర రోడ్డు మలుపు తిరిగింది.

***

తాతయ్య పోయిన తొమ్మిదో రోజు.

నేనూ సెలవు పెట్టి ఉండిపోయాను.

రాత్రి పది గంటలవుతోంది.

అమ్మా, పెద్దమావయ్యా, పొరుగింటి విశ్వనాథంగారూ హాల్లో టిఫిన్ చేస్తున్నారు.

గదిలోంచీ హడావిడిగా హాల్లోకొచ్చింది అత్తయ్య. మావయ్య పక్కగా వెళ్ళి వంగి ఆయన చెవిలో ఏదో చెప్పింది. "ఆఁ !" అంటూ దిగ్భ్రమకిలోనై ఉన్నపాటున లోపలికి ఒక్క అంగవేశాడు మావయ్య.

అప్పటికప్పుడో అమ్మమ్మ ప్రాణహంస లేచిపోయింది!

-ఊరంతా గొల్లుమంది!

పచ్చి వెలక్కాయ గొంతునపడ్డట్టు ఉక్కిరి బిక్కిరైపోయారు ఇంట్లోవాళ్ళు.

అమ్మ సంగతి సరేసరి. గుండెలదిరేలా ఏడుపు.

గుండెలో లోపలా ఏడుపు! కరెంటు పెట్టిన మనిషిలా విలవిల్లాడింది!

***

అమ్మమ్మ పోయి ఇవ్వాళ్టికి పన్నెండు రోజులు. కర్మకాండ జరుగుతోంది. ఆమె సంతానంలో ఆరో కొడుకు తప్ప అందరూ వచ్చేశారు! మనవలూ మనవరాళ్ళూ మునిమనవలూ 'పెద్దలచావు పెళ్ళితో సమానం' అని రుజువు చేస్తున్నారు. కోడళ్ళూ అల్లుళ్ళూ-అంతా తామై నిర్వహిస్తున్నారు - 'పండగ'ని.

దానాలన్నీ భూరిగా సాగిపోయినై.

అందరికీ తృప్తిగా వుంది!

ఆ రాత్రి అమ్మ నాతో ప్రత్యేకంగా చెప్పింది. అసలు రహస్యం నాకు అప్పుడే తెలిసింది. తాతయ్య తన పాలసీల డబ్బుని ముప్పైనాలుగేళ్ళు పెంచి పోషించి, ఆ మొత్తాన్ని తన భార్య తదనంతరం సంతానానికి చెందేట్లు విల్లు రాసి పోయాట్ట. తలా ఐదు లక్షలు పైమాటే!

నేను చీకట్లో చీలికల్ని కూడుకుంటూ కూచున్నాను.

*

రచయిత సెల్: 9848025600

